

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**కవి రాజా అబ్ కవితా కె మత్ కాన్ మరోడో**

**ధంధే కి కుచ్ బాత్ కరో, కుఛ్ పైసా జోడో**

హాస్య గీతాల జాబితాలో ఈ గీతాన్ని ఎవరూ చేర్చరు. నిజానికి ఇది గీతం కన్నా 'కవిత' అనవచ్చు. నవరంగ్ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశంలో చొప్పించాడీ పాటను శాంతారాం. ఇది వ్యంగ్య భరితమైన హాస్య కవిత. కానీ ఈ కవితలో చేదు నిజాలున్నాయి. వింటున్న వారి పెదవులపై నవ్వు రాకమానదు. అర్థం అయిన వారి మనస్సు ద్రవిస్తుంది. పెదవులపై ఏడవలేని నవ్వు నిలుస్తుంది. ఒక సృజన అది సృజించిన కాలానికి మాత్రమే వర్తిస్తే సరిపోదు. నవరంగ్ సృజించి దాదాపుగా అరవై ఏళ్లు దాటిపోయాయి. కానీ ఇప్పటికి, అప్పటికన్నా ఎక్కువగా వర్తిస్తుంది. ఈ పాటలో వ్యంగ్యం చేస్తున్నది కవులను. సామాజిక పరిస్థితులపై వ్యంగ్యం విమర్శ చేస్తూ దానికి తగ్గట్టు మారమని కవులను బోధిస్తున్నట్టు సాగే ఈ కవితలో పై పై పొరలను తొలగించి చూస్తే చాలా లోతైన అర్థం కల పాట ఇది.

'నవరంగ్' సినిమా తన చుట్టూ ఉన్న సమాజంలో ఇమడలేని కవి కథ. ఈ సినిమాలో ప్రధాన పాత్ర తన కలల 'మోహిని'ని సృష్టించుకుంటాడు. ఆమెని ఊహిస్తూ శృంగార కవితలు రచిస్తూంటాడు. వాటిని ఆ కాలంలో 'అసభ్య' గీతాలుగా భావిస్తారు. అతని భార్య అపార్థం చేసుకుంటుంది. లౌక్యం తెలియని కవి రాజు బ్రిటీష్ వారికి లొంగిపోతే వ్యతిరేకిస్తాడు. ఇలా బ్రతకటం చేతకాని కవి అన్నమాట అతడు. అతడికి రాజు దగ్గర ఉద్యోగం వస్తుంది. అప్పుడు అతడు తన స్నేహితులు, అందరూ నాటకాలు వేసేవారు. పాటలు పాడేవారు. వారితో కూర్చున్నప్పుడు కవి కూడా మనిషేకదా, కవికి కూడా తిండి అవసరం కదా, తిండి కావాలంటే డబ్బు అవసరం కదా. ఆ సందర్భంలో ఓ స్నేహితుడు ఈ కవితను అందుకుంటాడు. చక్కటి కవిత. 'కవిరాజు, ఇప్పుడు కవిత చెవులు మెలి పెట్టకు, వ్యాపారం గురించి ఆలోచించు. కొన్ని డబ్బులు సంపాదించు ' అంటూ ఆరంభమవుతుంది. కవిత చెవులు మెలిపెట్టకు అనటంలోనే వ్యంగ్యం కనిపిస్తుంది. అంటే అలాంటి కవితలు రాసే కవులందరికీ అన్నమాట ఈ సలహా. ఈ కవితను రాసింది మహాకవి భరత్ వ్యాస్.

హిందీ సినీ ప్రపంచంలో భరత్ వ్యాస్ వంటి గేయరచయిత మరొకరు లేరు. భరత్ వ్యాస్ కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి సినీపాటలు రాశాడు. ఆయన సరళము, శుద్ధమూ అయిన హిందుస్తానీ పదాలు మాత్రమే వాడతాడు. హింసను ప్రేరేపించేవి, సంప్రదాయాన్ని కించపరచేవి, ఎదుటివారిని హేళన చేసి, ఎద్దేవా చేసే పాటలు

రాయడు. అతని ఊహలు ఉన్నతమూ, ఔచితమంతమూ, సంస్కారవంతమూ అయి ఉంటాయి. ఆయన సందర్భాలలో ఒదిగి సార్వజనీనమైన పాటను రచించాడు. నవరంగ్ సంగీత దర్శకుడు సి.రామచంద్ర. హిందీ సినీరంగంలో అత్యుత్తమ సృజనాత్మక సంగీత దర్శకులలో అగ్రస్థానంలో ఉంటాడు సి.రామచంద్ర. వీరంతా కలసి సందర్భాన్ని అర్థం చేసుకుని, ఆ సందర్భంలో విసురు ఎవరిపైనో గమనించి మరీ ఈ గీతాన్ని సృజించారు. ఆ కాలంలో సినీకళాకారుల నడుమ స్పర్ధలు ఆరోగ్యకరంగా ఉండేవి. వారి విసుర్లు, విమర్శలు అన్నీ వారి కళలో కనిపించేవి.

ఆ కాలంలో ఓ.పి నయ్యర్, శంకర్ జైకిషన్‌ల నడుమ మంచి పోటీ ఉండేది. ఓ.పి నయ్యర్ అహంకారి. కానీ అతని పాటలు మక్కికి మక్కీ పాశ్చాత్య బాణీలపై ఆధారపడి ఉండేవి. శంకర్ జై కిషన్ కూడా తక్కువ కాదు. కానీ వారి సృజనాత్మక స్థాయి వేరు. దాంతో వారు అవకాశం దొరికి సందర్భం కుదరగానే ఓ.పి నయ్యర్ పై విసురు విసిరారు. లవ్‌మేరేజ్ సినిమాలో ఓ క్లబ్బులో పాశ్చాత్య సంగీతానికి ప్రాధాన్యం ఇవ్వటం చూసి హీరో వారికి నిజానిజాలు వివరిస్తూ ఓ పాట పాడతాడు.

**తీన్ కనస్తర్ పీట్ పీట్ కర్ గలా  ఫాడ్ కర్ చిల్లానా**

**యార్ మెరే మత్   బురామాన్, యే గానా హై  న  బజానా హై**

'ఓ డబ్బా పై కత్తితో కొట్టినట్టు, గొంతు చించుకుని అరవటం పాటకాదు, అది సంగీతం కాదు మిత్రమా'

**ఉధర్ సె లేకర్, ఇధర్  జమాకర్**

**కబ్‌తక్ కాం చలావోగే**

**కిస్‌కా రహా జమానా**

**ఎక్‌దిన్ మహఫెల్ సే ఉర్ జావోగే**

**నకల్ క ధంధా చల్ నహిసక్తా**

**ఎక్‌దిన్ తో పచ్ తానా హై**

అక్కడినుంచి తీసుకుని ఇక్కడ వాడటం, ఎంతకాలం ఇలా పని నడిపిస్తావు. ప్రతిరోజూ ఒకలాగే ఉండదు. ఈ ప్రపంచం ఎవరిదీ కాదు. ఎవరూ శాశ్వతం కాదు. ఎప్పుడో ఒకప్పుడు వెళ్లిపోక తప్పదు. మోసం బయట పడక తప్పదు. కాబట్టి ఈ కాపీ కోట్టే వ్యవహారం ఎక్కువకాలం సాగదు. ఏదో ఒకరోజు బండారం బట్టబయలవుతుంది. బాధపడతావు. సినిమాలో పాశ్చాత్యం నుంచి ఎత్తుకురావటాన్ని విమర్శిస్తున్నాడు. బయట సంగీత దర్శకులు తమ 'కసి' తీర్చుకుంటున్నారు. పాటలోని భావం సార్వజనీనం. ఎల్లప్పుడూ అందరినీ మోసం చేయటం కుదరదు. ఎప్పుడో నిజం బయట పడక తప్పదు. ఆ కాలంలో కళాకారుల నడుమ కళా యుద్ధాలు ఇలా జరిగేవి. అయితే ఇవన్నీ సంస్కారపు

సరిహద్దులు దాటేవికావు. ఇదంతా ప్రచ్ఛన్నం తప్ప ఏదీ ప్రత్యక్ష్యం కాదు. అందరూ మంచి స్నేహితులు. ఒకరినొకరు గౌరవించుకునేవారు. పరస్పరం సహకరించుకునేవారు.

'నవరంగ్' సినిమా తయారయ్యేనాటికి సినీ రంగం రూపురేఖలు మారుతున్నాయి. సినిమా పంథా మారుతోంది. నిరాశా నిస్పృహలు ప్రదర్శించటం, సమాజాన్ని విమర్శించటం, లోపాలెత్తి చూపటం, తప్ప ఆత్మవిశ్వాసాన్నివ్వటం, ఒక పాజిటివ్ దృక్పధాన్ని ప్రదర్శించటంలేదు. పేదరికం పై, ధనవంతుల అణచివేతలపై కవితలు రాయటం ఫేషన్ అయింది. ఏసీ గదుల్లో కూర్చుని ఎండలో తిండి లేక మాడేవాడి కడుపు మంటను వర్ణించటం గొప్ప కవిగా పేరు సంపాదించటానికి రాచమార్గం అయింది. భరత్‌వ్యాస్, సి.రామచంద్ర, శాంతారాం వంటి వారు ఇలాంటి ధోరణికి వ్యతిరేకం. మనలో లోపాలు ఎంచుకుంటూ కూర్చోవటం సరిపోదు. మన లోపాల్ని సవరించుకుంటూ, మంచిని ప్రకటిస్తూ, ఆత్మవిశ్వాసంతో ఆత్మగౌరవంతో ముందుకు సాగాలి అన్నది వీరి సిద్ధాంతం.

**షేర్ షాయరీ కవి రాజా నా కాం ఆయేగీ**
**కవితా కీ పోతే కొ దిమాక్ ఖా జాయేగీ**
**భావ్ ఛడ్ రహే అవాజ్ మహెంగా హో రహో దిన్ దిన్**
**భూక్ మరోగే రాత్ కటేగే తారే గిన్ గిన్**
**ఇసీలియే యే కహెతాహు యే సబ్ ఛోడో**
**ధంధే కే కుఛ్ బాత్‌కరో, కుఛ్ పైసే జోడో**

కవిత్వం ఎందుకూ పనికిరాదని సున్నితంగా, హాస్యంగా, వ్యంగ్యంగా చెప్తున్నాడు. రోజు రోజుకీ ధరలు పెరుగుతున్నాయి. బియ్యం ధర పెరిగిపోతోంది రోజూ. తిండిలేక నిద్రరాక రాత్రంతా తారలు లెక్కపెడుతూ ఆకలితో ఛస్తావు. అందుకే ఈ కవితలు, గివితలు వదిలేయ్, కాస్త పనికొచ్చే ఆలోచనలు చెయ్యి. డబ్బులు సంపాదించు.

**అరె ఛోకలం మత్ చలావో కవితా చాకీ**
**ఘర్ కీ రోకడ్ దేఖో కిత్నే పైసే బాకీ**
**అరె, కిత్నా ఘర్ మే ఘీ హై కిత్ నా గరం మసాలా**
**కిత్నే పాపడ్, మోంగ్ బడీ మిర్చ్ మసాలా**
**కిత్న తేల్ నూన్ మిర్చ్ హల్దీ ఔర్ ధనియా**
**కవి రాజా చుప్కే తుం బన్ జావో బనియా**

కలం పక్కన పారేయ్. దాన్ని కదపటం మానెయ్. దాన్ని అరగదీయటం మానేయ్. ఇంటి పరిస్థితి చూడు. ఇంట్లో ఎన్ని పైసలు ఉన్నాయో చూడు. ఎన్ని అప్పడాలు ఉన్నాయి, ఎన్ని పప్పులు, ఉప్పుకు, మసాలాలు, మిర్చీ, నూనె వంటివి

ఉన్నాయో చూడు. నువ్వు హాయిగా ఓ వ్యాపారి అయిపో. ధనియా, బనియా చక్కని ప్రాస కుదిరింది. కవికి కూడా సంసారం ఉంటుంది. కవికూడా బ్రతకాలంటే తినాలి కాబట్టి ముందు తిండి సంగతి చూడు. తరువాత కవిత సంగతి ఆలోచించు అంటున్నాడు.

ఇప్పుడు కూడా ఇది వర్తిస్తుంది. మన సమాజంలో, ముఖ్యంగా తెలుగు సాహిత్య ప్రపంచంలో కేవలం రచన మీద ఆధారపడి జీవించే పరిస్థితి లేదు. కాబట్టి రచనలు చేయాలనుకునవారు జీవిక కోసం వేరే చూసుకోవాలి. ఏదో ఉద్యోగమో, వ్యాపారమో చూసుకోవాలి. ఇక్కడ కవితలో ఉప్పులు, పప్పులు, కూరలు లేవని వెతుక్కునే బదులు 'నువ్వే వ్యాపారి అయిపో' అంటున్నాడు. ఇది వ్యంగ్యం. సినీ రంగంలో కవులు కొందరు డబ్బు కనబడందే పెన్ను పట్టరు. వారు డబ్బులు కచ్చితంగా వసూలు చేస్తారు. డబ్బు విషయంలో రాజీపడరు. వారు 'కవులా? కాబూలీ వాలాలా?' అనేవారు ఆ కాలంలో నిరసనగా. ఇక్కడ భరత్ వ్యాస్ డబ్బులిస్తే ఏదైనా రాసే వారిపై విసురు విసుర్తున్నాడు.

**అరే పైసే పర్ రచో కావ్య, భూఖ్ పర్ గీత్ బనావో**
**అరే గేహూ పర్ హో గజల్, ధన్ కే షేర్ సునావో**
**నూన్ మిర్చ్ పర్ చౌపాయీ, చావల్ పర్ హో దోహే**
**సుగల్ కోయ లే పర్ కవితా లిఖోతో సోహె**
**కం భాడే కీ ఖోలీ పర్ లిఖో ఖవ్వాలీ'ఝున్ ఝున్ కర్తీ కహో రుబాయీ పైసే వాలీ**
**శబ్దోంకా జన్జాల్ బడా లఫ్డాహోతాహై**
**కవి సమ్మేళన్ దోస్త్ బడా ఝూగ్డా హోతాహై**
**పైసే వాలే షేర్ బడా తగ్డా హోతాహై**
**ఇసీలియే కహతాహూ న ఇసీ షేర్ పడో**
**ధంధేకీ కుఛ్ బాత్ కరో కుఛ్ పైసే జోడో.**

పైసలపై కవిత రాయమంటున్నాడు. ఆకలిపై కవితలు రాయమంటున్నాడు. గోధుమలపై గజల్ రాయమంటున్నాడు. ధనంపై షేర్ వినిపించమంటున్నాడు. ఉప్పు కారాలపై చౌపాయి రాయమంటున్నాడు. బియ్యంపై ద్విపద రాయమంటున్నాడు. పెరిగే ధరలు తరగాలని ఖవ్వాలీలు రాయమంటున్నాడు. డబ్బున్న వారిపై రుబాయీలు రాయమంటున్నాడు. శబ్దాల వాడకంతో ఎంతో అయోమయం ఉంది. కవి సమ్మేళనాలలో బోలెడన్ని గొడవలు జరుగుతాయి. ముషాయిరాల్లో షేర్ పై వివాదాలు చెలరేగుతాయి. కానీ అన్నిటికన్నా డబ్బులొచ్చే షేర్లు గొప్పవి. కాబట్టి ఇలాంటి కవితలు రాయకు. పనికొచ్చే పనులు చేయి. కాసిన్ని డబ్బులు సంపాదించు అంటున్నాడు భరత్ వ్యాస్. సినిమాలో ఈ కవిత ఆఘా పై చిత్రతమవుతుంది. పాడింది స్వయంగా భరత్ వ్యాస్. సమాజంలో నాణ్యమయిన కళకు,

కళాకారుడికీ ఆదరణ తగ్గి, కుహనా కళాకారులు, కళాపోషకుల జోరు పెరగటాన్ని నర్మగర్భితంగా సూచిస్తూ అసలయిన కళకు కాలం చెల్లిందని వ్యంగ్యంగా సూచిస్తున్నాడు భరత్ వ్యాస్. ఈ పాటను, నవరంగ్ సినిమా ఆరాంభంలో వచ్చే యె మారీ సఖీకి కహానీ కహేగీతో కలిపి విశ్లేషిస్తే శాంతారాం, భరత్ వ్యాస్‌ల ఆలోచనా ధోరణి బోధపడుతుంది.

నవరంగ్ 1959లో విడుదలయింది. అంతకు సరిగ్గా రెండేళ్ళ ముందు అంటే 1957లో 'ప్యాసా' సినిమా విడుదలయింది. ప్యాసాలో హీరో కవి. బ్రతకటం చేతకాని కవి. ఏ పనీ చేయడు. డబ్బు సంపాదించాలని ప్రయత్నించడు. కానీ ప్రపంచంలోని పేదరికం గురించి, అన్యాయం గురించి, అణచివేతల గురించి, మోసాల గురించి అద్భుతమైన కవితలు గుప్పిస్తాడు. 'ఈ ప్రపంచంలో ఉంటే ఎంత, పోతే ఎంత. ఇదో పాడు ప్రపంచం' అంటాడు 'వేశ్యా వాటికలను చూపిస్తూ ఇదే నా మీ ఆత్మగౌరవం?' అని నిలదీసి ప్రశ్నిస్తాడు. తాగిన మత్తులో తినటానికి తిండి ఉండదు. ప్రపంచమంతా తనకి అన్యాయం చేస్తున్నట్టు 'తాను ప్రేమ కోరితే ముళ్లు లభించాయని' వాపోతాడు. దానికీ ప్రపంచానిదే దోషం అంటాడు. ప్రశ్నలడగటం, నిరసన వ్యక్తంచేయటం తప్పు పట్టటం తప్ప నిర్మాణాత్మకంగా ఏమీ చేయదన్నమాట ఆ కవి. అదిగో సరిగ్గా అలాంటి కవికి భరత్ వ్యాస్ సలహా ఇస్తున్నాడు 'ధంధేకీ కుఛ్ బాత్ కరో, కుఛ్ పైసా జోడో', అని.

రాజులు పోయారు, జమిందార్లు పోయారు, కవులను పోషించే వారు పోయారు. ఇపుడు కవి కేవలం కవిత్వం రాస్తానంటే సరిపోదు. జీవిక గురించి ముందు ఆలోచించాలి. తరువాత కవిత గురించి ఆలోచించు అంటూ ఓ వైపు నుంచి సలహా ఇస్తూ మరోవైపు గేలి చేస్తున్నాడు. గొప్ప గొప్ప కవితలు రాసిన సాహిర్ కానీ, మజ్రూహ్ కానీ డబ్బు విషయంలో రాజీ పడలేదు. క్రెడిట్ విషయంలో రాజీపడలేదు. దుర్భర పేదరికం గురించి అన్యాయాలు, అణచివేతల గురించి, గొప్ప పాటలు రాశారు, ముఖ్యంగా సాహిర్. 'ప్యాసా'లో 'విజయ్' పాత్రకూ నిజ జీవితంలో 'గురుదత్'కూ దగ్గర సంబంధం ఉంటుంది మానసికంగా. కానీ విజయ్ మనస్సును కవితల రూపంలో ప్రదర్శించిన సాహిర్‌తో విజయ్‌కు పోలికలేదు. ఈ వైరుధ్యాన్ని వ్యంగ్యంగా ఎత్తి చూపిస్తున్నాడు భరత్ వ్యాస్. 'గజల్' సినిమా సాహిర్ లూధియాన్వీ లాంటి విప్లవ కవి, సినిమాలో ప్రేమ గీతాలు రాయటం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ విమర్శ చేసేవారికి సమాధానం లాంటిది . ఇలా అకాలంలో అతి సున్నితంగా, ప్రచ్ఛన్నంగా కళ ఆధారంగా యుద్ధాలు జరిగేవి. ఓ వైపు సమాజంలో కవుల పరిస్థితిని వివరిస్తూ, చక్కటి సలహా ఇస్తున్నట్టుంటుంది. భరత్ వ్యాస్ కవిత. మరోవైపు తగిలేవారికి చురకలు తగులుతూంటాయి. ఇవేవీ తెలియని వారికి చక్కటి హాస్యం కలుగుతుంది. 'పైసే వాలీ కవితా బడా తగ్డా హోతాహై' ఏ కవిత ఎలా ఉన్నా, డబ్బులు వచ్చే కవిత అన్నిటికన్నా గొప్పది.

పాట చిత్రీకరణ కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. హాస్యంగా ఉంటుంది. సీరియస్ సినిమాలో 'రిలీఫ్'గా ఉంటుంది. ఇలా కవులను వెక్కిరిస్తూ, వ్యంగ్యం చేస్తూ, హాస్యం చేసే సినీగేయం మరొకటి లేకపోవటం గమనార్హం. మన సినిమాల్లో కవులు హీరోలు. భరత్ భూషణ్ అయితే కవి హీరోనే. కానీ ఏ సినిమాలో కూడా కవుల దుస్థితికానీ, వారు

ఎదుర్కొనే అన్యాయాలు, అణచివేతలు, మోసాల ప్రసక్తికానీ మన సినిమాలు అంతగా ప్రస్తావించలేదు. 'ప్యాసా' కవి అంతరంగాన్ని ప్రదర్శిస్తుంది. 'ఆశిక్' సినిమా ఒక సృజనాత్మక హృదయానికి, ప్రేరణ ఆవశ్యకతను ప్రదర్శిస్తుంది. 'నవరంగ్' ఆరోగ్యకరమైన ప్రేరణను చూపిస్తుంది. 'నయాజమానా' గ్రంథ చౌర్యాన్ని చూపిస్తుంది. 'నమక్ హరాం' కవి మరో రూపును చూపిస్తుంది. 'కభీకభీ'లో కనబడే కవి నిత్య జీవితంలో రాజీపడి కవితను వదిలేస్తాడు. 'చెల్లెలి కాపురం' ఘోస్ట్ రచన చూపిస్తుంది. కానీ 'నవరంగ్ 'లో భరత్ వ్యాస్ కవిత చూపించిన కోణంలో మాత్రం కవిని ఏ సినిమా చూపించలేదు. హాస్యంలో దాగి ఉన్న విషాదం ఇది. ప్రపంచానికి మార్గదర్శనం చేసే కవి తనను తాను రక్షించుకోలేడు. తాను అన్యాయానికి గురవటం, ఎక్స్ప్లాయిట్ అవటం గమనించలేడు. అందరికీ ఆత్మ విశ్వాసం అందించే కవి ఆత్మన్యూనత భావంతో కుములుతాడు. తాను చీకటిలో మ్రగ్గుతూ, ఇతరులకు వెలుగునందించాలని తపన పడతాడు. 'అందరికీ వెలుగునందించవచ్చు, ముందు నీ ఇంట్లో దీపం వెలిగించుకో' అని చెప్పింది భరత్ వ్యాస్ ఒక్కడే. 'కవిరాజా కవితా కె అబ్ మత్ కాన్ మరోడో, ధంధే కే కుఛ్ బాత్ కరో, కుచ్ పైసా జోడో' అని సలహా ఇచ్చింది భరత్ వ్యాస్ మాత్రమే.

Post your comments